క్లుప్తంగా

ఎరువుల దుకాణాల తనిఖీ



దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ ప్రియదర్శిని

గంగాధర: ఎరువులు, క్రిమిసంహారక మందుల దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు ప్రియదర్శిని సూచించారు. మండలంలోని మధురానగర్ చౌరస్తాలోని ఎరువుల దుకాణాలను సోమవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా క్రయ, విక్రయ రికార్డులను పరిశీలించారు. స్టాక్ సంబంధించిన వివరాలు బోర్డుపై నమోదు చేయాలని, ప్రతి రైతుకు కొనుగోలు చేసిన మందులు, విత్తనాలు, ఎరువులకు సంబంధించిన బిల్లులు ఇవ్వాలన్నారు. ఎమ్మార్పీకి మించి అమ్మితే చర్యలు తీసుకుంటమన్నారు. ఏడీఏ వెంట మండల వ్యవసాయఅధికారి శ్రీనివాస్, తదితరులున్నారు.

బోర్‌వెల్ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్

రామడుగు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల దాహార్తి తీర్చడానికి ఎంపీ నిధులతో బోర్‌వెల్ పనులను కరీంనగర్ కార్పొరేటర్ బండ సుమరమణారెడ్డి సోమవారం ప్రారంభించారు. పాఠశాలలో నీటి సమస్య పరిష్కారానికి పూర్వ విద్యార్థి కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఈసందర్భంగా మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం పద్మజ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నరేందర్‌రెడ్డిని మెజారిటీతో గెలిపించుకుందాం

మానకొండూర్: కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తి పటేల్ అన్నారు. మండల కేంద్రంలోని పద్మావతి కళ్యాణ మండపంలో బీసీ సంక్షేమ సంఘం నాయకుల సమావేశంలో మాట్లాడారు. నలభై ఏళ్లుగా అనేక మంది విద్యార్థులను ఉత్తములుగా తయారుచేసిన ఘనత నరేందర్‌రెడ్డిదని, జిల్లా వ్యాప్తంగా పలు గ్రంథాలయాల్లో మౌలిక వసతులు కల్పించారని గుర్తు చేశారు. వివిధ ఉద్యోగాలకు సిద్ధమయ్యే యువత కోసం కోచింగ్ సెంటర్లు ఏర్పాటుచేసి ఉచితంగా మెటీరియల్ అందిస్తూ అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెంట అజయ్ పటేల్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి కాల్వ మదుబాబు, మండల అధ్యక్షులు ముక్కెర సతీష్, గట్టు తిరుపతి, పాండురాల కనక రాజేశం, బొడ్డు అయిలయ్య, నడిబొట్టు శంకర్, బొంగోని సునీల్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టు



గన్నేరువరం: పోలీసుల అదుపులో మల్లేశం

హుజూరాబాద్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా తెలంగాణ మాలల జేఏసీ పిలుపు మేరకు హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయ ముట్టడికి వెళ్తున్నారనే సమాచారంతో సోమవారం పోలీసులు మాల మహానాడు నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మాల మహానాడు నాయకులు మాట్లాడుతూ... అంబేడ్కర్‌ను అవమానపరిచేలా మాట్లాడుతున్న బీజేపీ నాయకులకు తగిన సమయంలో గుణపాఠం తప్పదని, కేంద్ర మంత్రి వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. పోలీసుల అదుపులో నాయకులు సొల్లుబాబు, పసుల స్వామి, తొగరు స్వామి, నీరటి రమేష్‌కుమార్, తొగరు సంపత్ ఉన్నారు.

గన్నేరువరం: అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ కార్యాలయం ముట్టడికి వెళ్తున్న మాల మహానాడు మండల అధ్యక్షుడు అనుమండ్ల మల్లేశంను ఏఎస్సై రాధాకిషన్, హెడ్‌కానిస్టేబుల్ భాస్కర్‌రెడ్డి సోమవారం జంగపల్లిలో అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఇల్లందకుంట: మండలంలోని మాలమహానాడు నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. రిజర్వేషన్లు ఎత్తేసి ఎస్సీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ అవకాశాలు లేకుండా చేయడానికి ప్రభుత్వాలు దుష్ప్రచారంతో మాలలను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నాయని, అరెస్ట్‌లతో ఉద్యమం ఆగదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నాయకులు మొగిలి, చిరంజీవి, దిలీప్ హెచ్చరించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



హుజూరాబాద్‌లో వాహనదారుడికి గులాబీ పూలు ఇస్తున్న విద్యార్థులు, సీఐ తిరుమల్‌గౌడ్

హుజూరాబాద్: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని హుజూరాబాద్ టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని కేరళ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులతో కలిసి ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. జమ్మికుంట–కరీంనగర్–వరంగల్ ప్రధాన రహదారిపై హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకుండా వస్తున్న వాహనదారులకు విద్యార్థులు గులాబీ పూలు ఇస్తూ హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి వాహనాలు నడపాలని, అనుకోని ప్రమాదాలు సంభవించినప్పుడు అవే మనల్ని రక్షిస్తాయన్నారు. అనంతరం సీఐ మాట్లాడుతూ... విద్యార్థులు ట్రాఫిక్ రూల్స్ వివరించడం హర్షనీయమని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనల ప్రకారం వాహనాలను నడపాలని సూచించారు. అతివేగం, అజాగ్రత్తతో వాహనాలు నడిపి కుటుంబాలను రోడ్డుపాలు చేయొద్దని సూచించారు. వాహనాల వెంట ధ్రువీకరణ పత్రాలు ఉండాలని, మద్యం సేవించి, ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపొద్దన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులను తరలించొద్దు

ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను తరలించొద్దని హుజూరాబాద్ ఎంవీఐ కంచి వేణు అన్నారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని ఆటో డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ఆటో ముందు భాగంలో ప్రయాణికులను కూర్చోబెట్టుకోవద్దని, నలుగురిని మాత్రమే ఎక్కించుకోవాలని, ఆటో డ్రైవర్లు యూనిఫామ్ ధరించాలని, ఆటో కండీషన్ ప్రతిరోజు చెక్ చేసుకోవాలని, వాహన ధ్రువీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలని, ట్రాఫిక్ రూల్స్ ప్రకారంగా ఆటోలను నడపాలన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌ఫోర్ట్ కానిస్టేబుల్ నాగరాజు, హోంగార్డు శ్రీకాంత్ గౌడ్, లారీ డ్రైవర్లు, తదితరులున్నారు.



పట్టణంలోని ఆటో డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న ఎంవీఐ కంచి వేణు



చొప్పదండి పట్టణంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యం, తదితరులు

అభివృద్ధి పనులు ప్రారంభం

చొప్పదండి: పట్టణంలోని పలు వార్డుల్లో రూ.20 లక్షల అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సోమవారం ప్రారంభించారు. అనంతరం ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జరిగిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని రూ.పది లక్షల విలువ గల బీమా పత్రాలను సుమారు 300 మందికిపైగా కార్యకర్తలకు అందజేశారు. 22 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. రూ.నాలుగు లక్షలతో ఏర్పాటు చేసిన డ్రైక్లీనింగ్ షాపును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేశ్, మెప్మా పీడీ వేణుమాధవ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కీర్తి నాగరాజు, నాయకులు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, గుర్రం భూమారెడ్డి, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, మునిగాల సుధాకర్‌గౌడ్, పెరుమాండ్ల గంగయ్యగౌడ్, నిజానపురం చందు, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన మడిపల్లి సహస్ర గోవాలో జరిగిన రోప్ స్కిప్పింగ్ ఐఆర్ఎస్ఎఫ్ ఛాంపియన్ షిప్ 2024 పతకం సాధించింది. హైదరాబాద్‌లో జరిగిన ఐఐఎంయూఎన్ రాజకీయ చర్చలో పాల్గొని బెస్ట్ డెలిగేట్ అవార్డు సాధించింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సోమవారం సహస్రను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మునిగాల చందుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

‘బీసీ డిక్లరేషన్ అమలు చేయకుండా మోసం’



మాట్లాడుతున్న ఆకుల రాజేందర్, నాయకులు

జమ్మికుంట: కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయకుండా కాంగ్రెస్ మోసం చేస్తోందని కరీంనగర్ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, బీజేపీ ఓబీసీ మోర్చా స్టేట్ కౌన్సిల్ మెంబర్ కొత్త శ్రీనివాస్ ఆరోపించారు. సోమవారం పట్టణంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అవకాశం కల్పించాలని, మంగళవారం మండల కేంద్రాల్లో పార్టీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిరసన, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసే కార్యక్రమంలో బీజేపీ శ్రేణులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు దొంతరవేన రమేశ్‌యాద్, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి కైలాసకోటి గణేశ్, నాయకులు పుల్లూరి ఈశ్వర్, కొండపర్తి ప్రవీణ్, దొంగల రవి పాల్గొన్నారు.

మానకొండూర్: కాంగ్రెస్ పాలనలో బీసీలకు అన్యాయం జరుగుతోందని కేంద్ర ఫిల్మ్‌బోర్డు సభ్యుడు రంగు భాస్కరాచారి అన్నారు. బీసీలకు జరుగుతున్న అన్యాయంపై మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలకు ముందు కామారెడ్డి జిల్లాలో బీసీ డిక్లరేషన్ ప్రకటించారని, ఎన్నికల ముగిసిన తర్వాత బీసీల గూర్చి ఆలోచించడంలేదన్నారు. వెంటనే బీసీ డిక్లరేషన్ ప్రకటించాలని, బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణాచారి, పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, బీజేవైఎం మండలాధ్యక్షుడు బాషబోయిన ప్రదీప్‌యాదవ్, నాయకులు మీస రమణయ్య, రాజగోపాల్‌రెడ్డి, రామినేని ప్రవీణ్, తుడిచెర్ల మహేందర్, కూకట్ల చంద్రయ్య, రాజు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణపై విచారణ

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామంలో సోమవారం రోడ్డు విస్తరణపై హుజూరాబాద్ డీఎల్‌పీవో శ్రీనివాస్ విచారణ చేపట్టారు. గ్రామం నుంచి ఏరడపల్లి వరకు డబుల్ రోడ్డు పనులు చేయగా తాడికల్‌లో రోడ్డు విస్తరణ చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయి. గ్రామంలో కొందరు ఇంటి యజమానులు 40 ఫీట్ల విస్తరణ చేయొద్దని ఫిర్యాదు చేయడంతో విచారణ చేసిన డీఎల్‌పీవో శ్రీనివాస్ నివేదికను కలెక్టర్‌కు అందిస్తామన్నారు. వెంట ఎంపీవో ప్రభాకర్, కార్యదర్శి వీరప్రతాప్ ఉన్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయాలి



శ్రీనివాస్‌గౌడ్‌కు పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సోమవారం కాంగ్రెస్ నాయకులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఇటీవల కలెక్టర్ కేశవపట్నం పీహెచ్‌సీని తనిఖీ చేసి ఆసుపత్రి అభివృద్ధి కోసం రూ.ఐదు లక్షల నిధులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈమేరకు ఆరోగ్య కేంద్రంలో చేయనున్న పనులను ఏఈ మల్లేశంతో కలిసి మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ పరిశీలించారు. ప్రతిపాదనలు తయారు చేయాలని ఏఈకి సూచించారు.

సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలి

మానకొండూర్: మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామానికి సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు అప్పనితిరుపతి, సంఘ ప్రవీన్, అమ్ముల శ్రీనివాస్, సంగమల్లయ్య సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామ స్టేజీ వద్ద నేషనల్ హైవే 563 రోడ్డు పనులు జరుగుతున్నాయని, గ్రామానికి వచ్చే విధంగా సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయడం లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. సర్వీస్ రోడ్డు ఏర్పాటుపై గతంలో నేషనల్ హైవే, రెవెన్యూ అధికారులకు విన్నవించుకున్న పట్టించుకోవడం లేదని వాపోయారు. గ్రామంలోకి చేరుకునే విధంగా సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత



నగదు అందిస్తున్న మిత్రులు

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన దరిపెల్లి రవి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా అతని కుటుంబానికి చిన్ననాటి మిత్రులు సోమవారం రూ.1,10,500 అందించారు. మృతుడి కూతురు మన్విత పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కత్తుల ప్రశాంత్, పెండ్యాల కిరణ్, పోస్ట్‌మెన్ హైమద్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఆర్థిక సాయం చేసిన రవి మిత్రులను పలువురు అభినందించారు.

వీణవంక: మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన అంబాల వేణు అనారోగ్యంతో మృతి చెందగా మాజీ సర్పంచ్ పోతుల నర్సయ్య పరామర్శించారు. అనంతరం దహన సంస్కారాల కోసం మృతుడి కుటుంబానికి రూ.రెండువేలు అందించారు. వెంట సత్యనారాయణ, రాజు, అంబాల మధునయ్య, మల్లేశ్, రాజేశ్, సంపత్ ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

వీణవంక: మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామంలో పెరుక సంఘం క్యాలెండర్‌ను సంఘం జిల్లా అధ్యక్షుడు గాండ్ల చంద్రశేఖర్ ఆవిష్కరించారు. అనంతరం కుల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటు పడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బస్వ వెంకన్న, కరీంనగర్, హుజూరాబాద్, వీణవంక మండల అధ్యక్షులు గాండ్ల అంజయ్య, మీస రమేశ్, ముద్దసాని భిక్షపతి, ఉపాధ్యక్షుడు ఎగ్గని శ్రావణ్, అప్పని రాజు, శ్రీనివాస్, అప్పని హరీశ్, వెంట్రాజం ఉన్నారు.

ఎస్టీటీ యూనియన్...



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

గన్నేరువరం: మండలకేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ఎస్టీటీ యూనియన్ క్యాలెండర్‌ను సోమవారం మండల విద్యాధికారి ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బుర్ర మధు, మహిళా అధ్యక్షురాలు ఆర్ శిరీష, ఉపాధ్యక్షుడు డి. శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శులు కిరణ్‌కుమార్, అనిత, ప్రసన్నకుమారి, వేణుగోపాల్, స్వరూప, మహేశ్, శ్రీధర్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్....



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

చిగురుమామిడి: మండలంలోని చిన్నములకనూర్ మోడల్ స్కూల్‌లో తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ క్యాలెండర్‌ను ప్రిన్సిపాల్ హర్జిత్‌కౌర్ ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు సురేందర్, నవీన్, గుంటి వేణు, రాజు, రాములు పాల్గొన్నారు.

సన్మానం



అధ్యక్షులను సన్మానిస్తున్న నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హుజూరాబాద్ పట్టణ, మండల నూతన అధ్యక్షులు మేకల తిరుపతి, కొల్లూరి కిరణ్‌కుమార్‌ను సోమవారం నాయకులు సన్మానించారు. నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ. ఖాలీక్ హుస్సేన్, చంద్రశేఖర్, శ్రీనివాస్ పటేల్, హలీం, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

చొప్పదండి: పట్టణానికి చెందిన తాళ్లపల్లి రాజయ్య ఇటీవల మృతి చెందగా ఆయన కుమారులు కనకయ్య, చత్రపతి శ్రీనివాస్‌ను మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సోమవారం పరామర్శించారు. వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్ గౌడ్, మాజీ వైస్ చైర్మన్ కొత్త గంగారెడ్డి తదితరులున్నారు.

చదువుకున్న పాఠశాలకు గేటు ఏర్పాటు

శంకరపట్నం: మండలంలోని ఏరడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సోమవారం పూర్వ విద్యార్థులు గేటు ఏర్పాటు చేయించారు. పాఠశాల ఆవరణలో ఆకతాయిలు మల,మూత్రవిసర్జన చేసిన ఘటనను సామాజిక మాధ్యమంలో హెచ్ఎం పోస్టు చేశారు. పవిత్రమైన పాఠశాలను ఆకతాయిలు పాడు చేస్తున్నారని పాఠశాలను కాపాడుకునేందుకు పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చి గేటు అమర్చారు.

సాగునీరు మళ్లింపు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం గ్రామంలో బైపాస్‌రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండటంతో రోడ్డుపైకి ఎస్సారెస్పీ సాగునీరు పోతుండడటంతో జేసీబీతో నీటిని మళ్లించారు. వరదనీటితో గ్రామస్తులు ఇబ్బందులు పడుతుండగా సమాచారం అందుకున్న కాంగ్రెస్ నాయకులు కాలువ తీసి నీటిని మళ్లించారు.



సాక్షి స్పందన

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని ఒకటో, పదో వార్డుల్లో తాగు నీటి ప్రధాన పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథాగా పోతోందని, కలుషిత నీరు తాగాల్సి వస్తోందని గ్రామస్తులు ఏళ్లుగా పలుమార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదు. అధికారుల నిర్లక్ష్యంపై ఈ నెల 5న ‘సాక్షి’లో ప్రచురితమైన వాట్సాప్ కథనానికి ఎట్టకేలకు సంబంధిత అధికారులు స్పందించారు. ఎంపీడీవో పుల్లయ్య ఆదేశాలతో పారిశుధ్య సిబ్బంది సోమవారం లీకేజీకి మరమ్మతు చేశారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

చెడు అలవాట్లతో జీవితం నాశనం

డీఐఈవో జగన్మోహన్‌రెడ్డి



అల్పాహారం పంపిణీ చేస్తున్న డీఐఈవో

గంగాధర: విద్యార్థులు దురలవాట్లకు బానిసలై బంగారు భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయిలో రాణించాలని డీఐఈవో జగన్మోహన్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడానికి ప్రిన్సిపాల్, బోధన, బోధనేతర సిబ్బంది సొంతఖర్చులతో విద్యార్థులకు అందిస్తున్న అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా డీఐఈవో మాట్లాడుతూ విద్యార్థుల కోసం ప్రయత్నిస్తున్న సిబ్బంది ఆశయాన్ని వమ్ము చేయొద్దని విద్యార్థులకు సూచించారు. అల్పాహార పంపిణీలో భాగస్వామ్యులు కావడానికి దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



మాట్లాడుతున్న సీఐ తిరుమల్‌గౌడ్

హుజూరాబాద్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో ఏబీవీపీ హుజూరాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఖేలో భారత్ -2025 క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని, విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని రోజులో కనీసం గంట సమయం క్రీడలకు కేటాయించాలన్నారు. అనంతరం ఏబీవీపీ జిల్లా కన్వీనర్ పూసల విష్ణు మాట్లాడుతూ... జనవరి 12న స్వామివివేకానంద జయంతిని పురస్కరించుకొని ఖేలో భారత్ పోటీలు నిర్వహిస్తున్నామని, క్రీడా పోటీలకు విద్యా సంస్థలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోస్కుల అజయ్, నగర ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్, హాస్టల్ కన్వీనర్ అభిలాశ్, కో కన్వీనర్ జస్వంత్, స్పోర్ట్స్ కన్వీనర్ హరీష్, కో కన్వీనర్లు బిట్టు, అనురాగ్, విజయ్, రాంచరణ్ తదితరులు ఉన్నారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి

మానకొండూర్: సమాజంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎక్సైజ్ ఎస్సై భారతి అన్నారు. మండల కేంద్రంలోని చాణక్య హైస్కూల్‌లో క్యాన్సియస్‌నెస్ క్లబ్ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... మత్తు పదార్థాలు, చెడు అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని వివరించారు. అపరిచిత వ్యక్తులు ఇచ్చే వస్తువులు, తినుబండారాలను, తీసుకోవద్దని, మాదకద్రవ్యాల సరఫరాకు విద్యార్థులను వినియోగించుకొని వారి జీవితాలను నాశనం చేసే అవకాశం ఉందని అలాంటి వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ఆడెపు రవీందర్, కానిస్టేబుళ్లు సురేష్, కొండల్ రెడ్డి, మనోహర్, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల రాస్తారోకో



చిగురుమామిడి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

చిగురుమామిడి: తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా పేరిట రైతులను దగా చేస్తున్నందుకు నిరసనగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ తారారాణికి అందించారు. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, చిగురుమామిడి సింగిల్‌విండో చైర్మన్ వెంకటరమణారెడ్డి, నాయకులు కృష్ణమాచారి, సత్యనారాయణ, సర్వర్ పాషా, మహిపాల్‌రెడ్డి, తిరుపతి, మాజీ సర్పంచులు భూంరెడ్డి, లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ మల్లేశం, శివప్రసాద్, తిరుపతి, కొంరయ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైదాపూర్: రైతు భరోసాపై కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని, రైతులకు ఏటా ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పార్టీ పిలుపు మేరకు సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో చేశారు. రుణమాఫీలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సోమారపు రాజయ్య ఆరోపించారు. రైతుభరోసా కింద ఏడాదికి రూ. 12 వేలు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం దారుణమన్నారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఎల్కపల్లి రవీందర్, శ్రీధర్‌రెడ్డి, తొంట రజనీకాంత్, ప్రకాశ్‌రెడ్డి, పైడిపల్లి రవీందర్, మాదం స్వామి, వర్నె మోహన్ రావు, ఐలయ్య, సురేశ్ ఉన్నారు.

రైతు భరోసాపై మోసం

శంకరపట్నం: రైతు భరోసాతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల మోసం చేస్తోందని సీపీఎం మండల కార్యదర్శి వెల్మరెడ్డి రాజిరెడ్డి ప్రకటనలో ఆరోపించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఎకరాకు రూ.15,000 ఇస్తామని, వానాకాలంలో పైసా ఇవ్వలేదని, ఇప్పుడు ఎకరాకు రూ.12 వేలు ఇస్తామనడం సరికాదన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా కౌలు రైతులకు, కూలీలకు న్యాయం జరగలేదన్నారు.